

TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్



WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-226 | పేజీలు:-4 | బుధవారం 29-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM


## ముఖ్యమంత్రుల ఆస్తులు, కేసులు

ఏపీ, తెలంగాణ సీఎంలది ప్రత్యేక స్థానం!



- దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలు
- ఆస్తుల్లో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానం
- క్రిమినల్ కేసుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి అగ్రస్థానం
- రేవంత్ రెడ్డిపై దేశంలోనే అత్యధికంగా 80 కేసులు నమోదు

దేశంలోని ముఖ్యమంత్రుల ఆస్తులు, వారిపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలతో - మిగతా 2 లో

# రేవంత్ 'యూత్' మంత్రం
# బీజేపీకి రేవంత్‌రెడ్డి మాస్టర్ స్ట్రోక్?

- 'జై జవాన్ - జై కిసాన్'కు 'జై యువ'ను జోడించిన రేవంత్‌రెడ్డి
- దేశ నిర్మాణంలో యువతను భాగస్వాములుగా గుర్తించే యత్నం
- యువత ఆగ్రహాన్ని, కాంగ్రెస్ వైపు సానుకూలతగా మార్చే వ్యూహాత్మక ఎత్తుగడ
- జాతీయ స్థాయిలో చర్చకు తెరలేపిన తెలంగాణ ముఖ్యమంత్రి




"సమస్య వచ్చినప్పుడు స్పందించడం వేరు, ఆ సమస్యనే అవకాశంగా మార్చుకుని రాజకీయ ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం వేరు" ఈ సూత్రాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది.

## బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్



- హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు అన్న కేటీఆర్
- హైడ్రా పేరుతో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రం రాజకీయాల్లో తీవ్ర - మిగతా 2 లో

## ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు
# క్షమాపణ చెప్పిన మెటా

- సాంకేతిక లోపమే కారణమన్న సంస్థ
- వెంటనే వీడియో పునరుద్ధరణ
- ఘటనను సీరియస్‌గా పరిగణిస్తున్న కేంద్రం
- మెటా అధికారులకు సమన్లు ఇచ్చినట్లు సమాచారం




ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్‌లో కొద్దిసేపు నిలిపివేసిన ఘటనపై కేంద్ర ప్రభుత్వానికి మెటా క్షమాపణ చెప్పింది. ఇది ఉద్దేశపూర్వకంగా జరగలేదని, సాంకేతిక లోపం వల్లేనని వివరణ ఇచ్చింది.

## కెమెరా యాంగిల్ కాదు, హృదయం యాంగిల్ మార్చండి

ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక



- విద్యార్థులపై లాఠీఛార్జ్ ఎందుకు చేశారని ప్రభుత్వానికి ప్రశ్న
- పదేళ్లలో 152 పేపర్ లీక్‌లు జరిగినా ఒక్క మాఫియాను శిక్షించలేదని విమర్శ
- కొత్త చట్టాలు కాదు, నిజాయితీతోనే యువత నమ్మకాన్ని గెలవగలరని వ్యాఖ్య

ప్రభుత్వం యువత (జెన్-జీ) నమ్మకాన్ని గెలుచుకోవాలంటే ప్రధాని నరేంద్ర మోదీ మార్చుకోవాల్సింది కెమెరా యాంగిల్ - మిగతా 2 లో

## కొత్త విద్యామంత్రిపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు




- కొత్త విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- బిల్కిస్ బానో కేసు దోషుల విడుదలను జోషి గతంలో సమర్థించడమే కారణం
- రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి నియామకంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. - మిగతా 2 లో

## జైల్లో ఉన్న సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్



- అంపోలు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సీదిరి అప్పలరాజు
- ఎల్లుండి ములాఖత్ ద్వారా పరామర్శించనున్న జగన్
- అప్పలరాజు కుటుంబ సభ్యులను కలవనున్న వైసీపీ అధినేత

వైసీపీ అధినేత జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సిద్ధమయ్యారు. ఈ నెల 30 (గురువారం)న ఆయన శ్రీకాకుళం వెళ్లనున్నారు. ఈ పర్యటనలో - మిగతా 2 లో

## మంత్రి పదవికి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి



- డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న రోజా
- 427 మందికి అక్రమంగా పోస్టులు కట్టబెట్టారని ఆరోపణ
- లోకేశ్ రాజీనామా చేసేంత వరకు పోరాటం ఆగదని వ్యాఖ్య

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల నిర్వహణలో భారీగా అక్రమాలు, కుంభకోణం జరిగాయంటూ - మిగతా 2 లో

## ఏపీపై ఎల్‌నినో పంజా
# సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష


- ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. జూలైలో 69 శాతం లోటు వర్షపాతం
- రానున్న నెలల్లో 40 శాతం వరకు వర్షాభావ పరిస్థితులు
- పత్తి, వరి పంటలపై ప్రభావం.. 122 మండలాలను గుర్తించిన ప్రభుత్వం
- పంటల రక్షణకు అత్యవసర ప్రణాళిక.. ప్రత్యామ్నాయాలపై దృష్టి
- పశుగ్రాసానికి కొరత లేదు.. 5 నెలలకు సరిపడా నిల్వలు సిద్ధం




ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

## మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు


- టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
- టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై నెతన్యాహు అభ్యంతరం
- టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్
- తన విషయంలో టర్కీ నమ్మకంగా వ్యవహరించిందని వ్యాఖ్య



టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి - మిగతా 2 లో

## ఏళ్ల నాటి సౌర రహస్యం సూర్యుడిలో 'తప్పిపోయిన' వెండి గుట్టు వీడింది!

- ఏళ్లుగా అంతుచిక్కని సూర్యుడి రహస్యాన్ని ఛేదించిన పరిశోధకులు
- సూర్యుడిలో వెండి తక్కువగా లేదని తాజా అధ్యయనంలో వెల్లడి
- కాంతి ప్రవర్తన వల్లే వెండి పరిమాణం తక్కువగా కనిపించిందని నిర్ధారణ
- అనుకున్న దానికంటే సూర్యుడిలో 55 శాతం ఎక్కువ వెండి ఉన్నట్లు అంచనా
- సూపర్ కంప్యూటర్ సిమ్యులేషన్ల ద్వారా ఈ కొత్త విషయాన్ని కనుగొన్న పరిశోధకులు



మన సౌర కుటుంబానికి కేంద్రమైన సూర్యుడికి సంబంధించి ఏళ్లుగా శాస్త్రవేత్తలను వేధిస్తున్న ఓ పెద్ద మిస్టరీకి తెరపడింది. సూర్యుడిలో వెండి పరిమాణం అనుకున్న దానికంటే చాలా తక్కువగా ఉందని ఇప్పటివరకు భావించారు. - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం దృష్టి తెలుగు న్యూస్
బుధవారం 29-07-2026

## జైల్లో ఉన్న సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న జగన్

మొదటిపేజీ తరువాయి – భాగంగా అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు సీదిరి అప్పలరాజును జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించనున్నారు. ఇటీవల జరిగిన ఒక బైక్ ప్రమాదంలో (అప్పలరాజు కుమారుడి కేసు) ఒక వ్యక్తి మృతి చెందిన ఘటనకు సంబంధించి, దర్యాప్తును పక్కదోవ పట్టించారనే ఆరోపణలతో అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కేసును కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కుట్రపూరితంగా నమోదు చేసిందని వైసీపీ ఖండిస్తోంది. ఒక సాధారణ రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి, అప్పలరాజును ఏ3గా చేర్చడం వెనుక పెద్ద కుట్ర ఉందని పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పర్యటన ద్వారా సీదిరి అప్పలరాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ పూర్తి అండగా ఉంటుందనే భరోసానివ్వడమే కాకుండా, పార్టీ కేడర్‌లో ధైర్యాన్ని నింపడమే జగన్ పర్యటన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సీదిరి అప్పలరాజును పరామర్శించిన అనంతరం జగన్ ఆయన కుటుంబ సభ్యులతో కూడా భేటీ కానున్నారు.ం

## మంత్రి పదవికి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి

మొదటిపేజీ తరువాయి – మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పై నిప్పులు చెరిగారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెకండ్ గేట్ వద్ద వైసీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో రోజా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తూ దీనిని 'దగా డీఎస్సీ'గా మార్చేసిందని ఆమె ఆరోపించారు. జీవో 420 జారీ చేసి అర్హత లేని దాదాపు 427 మందికి అక్రమంగా పోస్టులు కట్టబెట్టారని, పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని రోజా విమర్శించారు. డీఎస్సీ స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ నారా లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లోకేశ్ దిగిపోయే వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. రూ. 7 వేల కోట్ల బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని రోజా ధ్వజమెత్తారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కేవలం తమ అనుకూల ప్రచార పత్రికలను కాపాడుకోవడంలో మునిగి తేలుతోందే తప్ప... మహిళల రక్షణను, నిరుద్యోగుల భవిష్యత్తును పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.c

# ముఖ్యమంత్రుల ఆస్తులు, కేసులు

మొదటిపేజీ తరువాయి – అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఓ నివేదికను విడుదల చేసింది. దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 మంది సీఎంల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించి ఈ రిపోర్ట్ రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం, దేశంలో అత్యంత సంపన్న ముఖ్యమంత్రులుగా దక్షిణాది నేతలే తొలి మూడు స్థానాల్లో నిలిచారు. రూ.1413 కోట్ల ఆస్తులతో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ మొదటి స్థానంలో ఉండగా, రూ.931 కోట్ల ఆస్తులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండో స్థానంలో నిలిచారు. తమిళనాడు సీఎం విజయ్ రూ.648 కోట్లతో మూడో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.30 కోట్లకు పైగా ఆస్తులతో ఈ జాబితాలో 8వ స్థానంలో ఉన్నారు. క్రిమినల్ కేసుల విషయానికొస్తే, దేశంలోని ముఖ్యమంత్రులందరిలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. ఆయనపై ఏకంగా 80 కేసులు ఉన్నట్టు ఏడీఆర్ పేర్కొంది. రేవంత్ తర్వాత పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారిపై 29 కేసులు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌పై 19 కేసులు ఉన్నాయి. 19 కేసులతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నారు. దేశంలోని 31 మంది సీఎంలలో 14 మందిపై క్రిమినల్ కేసులు ఉండటం గమనార్హం. ఈ జాబితాలో అత్యల్ప ఆస్తులు కలిగిన సీఎంగా జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా (రూ.55 లక్షలు) నిలిచారు. మొత్తం 31 మంది సీఎంల మొత్తం ఆస్తుల విలువ రూ.8,660 కోట్లుగా ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.

## కెమెరా యాంగిల్ కాదు, హృదయం యాంగిల్ మార్చండి

మొదటిపేజీ తరువాయి – కాదని, తన ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా లోక్‌సభలో వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, సోషల్ మీడియా వీడియోలు, కొత్త కెమెరా యాంగిల్స్‌తో యువతలో విశ్వాసాన్ని నింపలేరని పేర్కొన్నారు. "ఈ తరం యువతకు అన్నీ తెలుసు, వారికి నిజానిజాలను గుర్తించే విచక్షణ ఉంది. వారి మనసు గెలవాలంటే నిజాయతీ అవసరం" అని ప్రియాంక స్పష్టం చేశారు. ఇటీవల నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "విద్యార్థులపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, పెల్లెట్ గన్స్, ఏకే-47లు వాడమని ఎవరు ఆదేశించారు? వారేమైనా ఉగ్రవాదులా?" అని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె ప్రశ్నించారు. దీనికి యావత్ దేశం సమాధానం కోరుకుంటోందని అన్నారు. నిరసనల్లో గాయపడిన ఓ విద్యార్థినిని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో పరామర్శించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ, రాజకీయ నాయకులు పదేపదే వచ్చి వీడియోలు తీస్తుండటంతో ఆ విద్యార్థిని తల్లి అనుభవించిన వేదన తనను సిగ్గుపడేలా చేసిందని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు 2024లో తీసుకొచ్చిన చట్టం కింద ఇప్పటివరకు ఒక్కరిని కూడా శిక్షించలేదని ప్రియాంక విమర్శించారు. గత దశాబ్ద కాలంలో 152 పేపర్ లీకేజీలు చోటుచేసుకుని దాదాపు 7.5 కోట్ల మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసినా, ఒక్క విద్యా మాఫియాను కూడా పట్టుకోలేకపోయారని ఆరోపించారు. కేవలం కమిటీలు వేస్తే సరిపోదని, జాతీయ విద్యా విధానంలో మార్పులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు.

## మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

మొదటిపేజీ తరువాయి – ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు. అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ విమర్శలకు ట్రంప్ ఘాటుగా స్పందిస్తూ, ఇజ్రాయెల్‌కు టర్కీపై మంచి అభిప్రాయం లేకపోవచ్చు కానీ తన విషయంలో మాత్రం టర్కీ ఎంతో నమ్మకంగా వ్యవహరించిందని స్పష్టం చేశారు.

## ఫేస్‌బుక్‌లో మోదీ వీడియో తొలగింపు.. క్షమాపణ చెప్పిన మెటా



మొదటిపేజీ తరువాయి – పొరపాటు గుర్తించిన వెంటనే వీడియోను పునరుద్ధరించినట్లు మెటా ప్రతినిధి వెల్లడించారు. జులై 23న అప్‌లోడ్ చేసిన ఈ వీడియోలో విద్యార్థుల నిరసనల సందర్భంగా జనరేషన్ జెడ్‌ను ఉద్దేశించి మోదీ సందేశం ఇచ్చారు. పరీక్షల ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కఠిన చర్యలు ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు. అయితే కొద్దిసేపు ఈ వీడియోను తెరవడానికి ప్రయత్నించిన వినియోగదారులకు 'చట్టపరమైన అభ్యర్థన మేరకు ఈ ప్రాంతంలో వీడియోను నిలిపివేశాం' అనే సందేశం కనిపించింది. అనంతరం వీడియోను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. మెటా ఇచ్చిన వివరణతో పాటు వీడియో తొలగింపునకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తోంది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని మెటా ప్రతినిధులు, సంబంధిత అధికారులను కేంద్రం పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర సమాచార సాంకేతిక శాఖ ఇప్పటికే మెటా, ఇన్‌స్టాగ్రామ్ ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# ఏపీపై ఎల్‌నినో పంజా.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



మొదటిపేజీ తరువాయి – వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం 551 మి.మీ మాత్రమే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రభావం అన్ని జిల్లాల్లో ఉన్నప్పటికీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పడంతో, వంశధార జలాలను తరలించి పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించిందని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో బోరు బావుల ఆధారంగా పంటలను కాపాడుకునే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 3 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, వరి పంటకు మాత్రం ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు గుర్తుచేశారు. మరోవైపు, పశు గ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసాన్ని అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి – దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్లాక్‌మెయిల్ సాధనంగా వాడుకుంటోందని, హైకోర్టు తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని ఆయన విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, బిల్డర్లను, సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడానికే హైడ్రాను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. అధికార పక్షానికి చెందిన వారి ఆస్తుల జోలికి వెళ్లడం లేదని, ఇదే నిజమైతే ముఖ్యమంత్రి సోదరుడి అక్రమ కట్టడాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలో ఏ అధికారి అయినా 63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడిన దాఖలాలు ఉన్నాయా అని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రా రేవంత్ రెడ్డికి వేటకుక్కలా మారిందని, దీనిని అడ్డుపెట్టుకుని బిల్డర్ల వద్ద 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సోదరుడి నివాసంతో పాటు కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, మహేందర్ రెడ్డి, కేవీపీల అక్రమ కట్టడాలను ఎందుకు కూల్చివేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో కలిపేస్తామని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కూడా కేటీఆర్ స్పందించారు. ఈ ఉదంతంతో దేశ యువత మొదటిసారిగా మోదీ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన అసమర్థతతో సరైన మద్దతు ఇవ్వలేకపోవడంతో, విద్యార్థులే నేరుగా పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరం వచ్చినప్పుడు యువత తప్పకుండా స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్ పేపర్ మూడుసార్లు లీక్ అయిందంటూ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

# రేవంత్ 'యూత్' మంత్రం.. బీజేపీకి రేవంత్‌రెడ్డి మాస్టర్ స్ట్రోక్?

మొదటిపేజీ తరువాయి – దేశవ్యాప్తంగా నీట్ కుంభకోణంపై యువత, విద్యార్థి లోకం అట్టుడుకుతున్న వేళ, ఆయన వేసిన '21 ఏళ్లకే పోటీ' అనే ఎత్తుగడ, సాధారణ రాజకీయ ప్రకటనల కంటే చాలా లోతైనది, వ్యూహాత్మకమైనదిగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ఆగ్రహాన్ని ఆయుధంగా...

దేశంలో దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ వ్యవహారం.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచింది. ఈ ఆగ్రహాన్ని కేవలం నిరసనలకే పరిమితం చేయకుండా, దానికి ఒక రాజకీయ రూపాన్ని ఇవ్వడంలో రేవంత్ ముందడుగు వేశారు. "మీరు కేవలం బాధితులు కాదు, రేపటి శాసనకర్తలు కావాలి. మీ సమస్యలను మీరే చట్టసభల్లోకి వచ్చి పరిష్కరించుకోవాలి" అని పరోక్షంగా పిలుపునివ్వడమే ఈ ప్రతిపాదనలోని అసలు మర్మం. ఇది యువతలోని నిస్సహాయతను పారదోలి, వారిలో ఆశను, అధికారంపై ఆకాంక్షను రేకెత్తించే ప్రయత్నం.

### 'జై యువ'.. పాత నినాదానికి కొత్త పదును

లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్ – జై కిసాన్' నినాదం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. దానికి 'జై యువ'ను జోడించడం ద్వారా రేవంత్ మూడు కీలక సంకేతాలు పంపారు.

గుర్తింపు: సైనికులు, రైతులంత ప్రాధాన్యం యువతకు ఇస్తున్నామని చెప్పడం.

ఆధునికీకరణ: కాంగ్రెస్ పార్టీ పాత చింతకాయ పచ్చడి కాదని, ఆధునిక తరమైన 'జెన్-జీ' ఆకాంక్షలను అర్థం చేసుకోగలదని చాటడం.

**ప్రత్యామ్నాయం:** బీజేపీ తరచూ వాడే 'యువశక్తి' అనే నినాదానికి పోటీగా, మరింత ఆచరణాత్మకమైన, అధికార భాగస్వామ్యాన్ని వాగ్దానం చేసే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

### జాతీయ వేదికపై రేవంత్

ఈ డిమాండ్ కేవలం తెలంగాణకు పరిమితమైనది కాదు. దీనికోసం రాజ్యాంగ సవరణ చేయాలి, ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఆగస్టులో అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రధానికి పంపుతామనడం ద్వారా రేవంత్ తన పోరాటాన్ని ఢిల్లీకి మారుస్తున్నారు. తద్వారా, రాహుల్ గాంధీ తర్వాత, బీజేపీకి వ్యతిరేకంగా యువత తరపున బలంగా గళం విప్పుతున్న జాతీయ స్థాయి కాంగ్రెస్ నేతగా తనను తాను ప్రాజెక్ట్ చేసుకుంటున్నారు. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను, రాజకీయ బరువును పెంచే ఒక మాస్టర్ స్ట్రోక్.

### దీర్ఘకాలిక వ్యూహం

21 ఏళ్లకే ఓటు హక్కు ఉన్నప్పుడు, అదే వయసుకు పోటీ చేసే అర్హత ఎందుకు ఉండకూడదనేది తార్కికంగా బలమైన వాదన. ఈ డిమాండ్ నెరవేరినా, నెరవేరకపోయినా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభమే.

కేంద్రం ఒప్పుకుంటే, అది కాంగ్రెస్ సాధించిన నైతిక విజయంగా, యువతకు తామిచ్చిన కానుకగా చెప్పుకోవచ్చు. ఒప్పుకోకపోతే, బీజేపీని 'యువత వ్యతిరేకి'గా చిత్రించి, రాబోయే ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వాడుకోవచ్చు.

అంతిమంగా, ఈ చర్చ ద్వారా దేశంలోని కోట్లాది మంది యువ ఓటర్లతో ఒక బలమైన బంధాన్ని ఏర్పరచుకోవడం, వారిని కాంగ్రెస్ వైపు ఆకర్షించడం ఈ వ్యూహంలో కీలక భాగం. మొత్తం మీద, రేవంత్ రెడ్డి ప్రకటనను కేవలం నీట్ బాధితులపై జాలిగా చూడలేం. ఇది ఒకే దెబ్బకు అనేక పిట్టలను కొట్టే రాజకీయ చతురత. యువత ఆగ్రహాన్ని చల్లార్చడం, వారిని ఆకర్షించడం, బీజేపీని ఇరుకున పెట్టడం, తన జాతీయ స్థాయి ఇమేజ్‌ను పెంచుకోవడం వంటి బహుళ ప్రయోజనాలతో కూడిన ఒక పక్కా రాజకీయ ఎత్తుగడ ఇది.


ఈ 'జెన్-జీ' అస్త్రం ఎంతవరకు పనిచేస్తుందో, కేంద్రం దీనిపై ఎలా స్పందిస్తుందో కాలమే నిర్ణయించాలి.

# కొత్త విద్యామంత్రిపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి – జోషిని రేపిస్టుల మద్దతుదారుడి అభివర్ణిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. బిల్కిస్ బానో కేసులో దోషుల విడుదలను గతంలో సమర్థించిన వ్యక్తికి కీలకమైన విద్యాశాఖను ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "నేరస్తులను సమర్థించే వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. ప్రహ్లాద్ జోషి నియామకం మన విద్యా వ్యవస్థకు, ప్రతి విద్యార్థికి అవమానకరం" అని వ్యాఖ్యానించారు. క్యాబినెట్‌లో ఇతర సమర్థులైన మంత్రులు ఉండగా, జోషినే ఎందుకు ఎంచుకున్నారో ప్రధాని సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. రాహుల్ సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సైతం లోక్‌సభలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. గర్భిణిపై అత్యాచారం చేసిన వారి విడుదలను సమర్థించిన వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం ద్వారా దేశంలోని కోట్ల మంది విద్యార్థినులకు ప్రధాని ఎటువంటి సందేశం పంపుతున్నారని ఆమె ప్రశ్నించారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీ ఆరోపణలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలను అప్పగించారు. 2018లో గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషులను విడుదల చేయగా, అప్పట్లో కేంద్ర మంత్రిగా ఉన్న జోషి ఆ నిర్ణయాన్ని సమర్థించారు. దోషులు జైలులో సుదీర్ఘ కాలం గడిపారని, వారి ప్రవర్తన బాగుందని ఆయన పేర్కొనడం అప్పట్లో వివాదాస్పదమైంది. అయితే, 2024లో సుప్రీంకోర్టు ఈ విడుదలను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిత్వ హననం కిందకు వస్తాయని ఆరోపించింది. ట్రెజరీ బెంచీల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవడంతో, స్పీకర్ ఓం బిర్లా ఆమె ప్రసంగంలోని కొన్ని భాగాలను సభ రికార్డుల నుంచి తొలగించాలని ఆదేశించారు.

# ఏళ్ల నాటి సౌర రహస్యం

# సూర్యుడిలో 'తప్పిపోయిన' వెండి గుట్టు వీడింది!



మొదటిపేజీ తరువాయి – అయితే, ఆ వెండి ఎక్కడికీ పోలేదని, కాంతి ప్రవర్తనలో ఉన్న సంక్లిష్టతల కారణంగా అది మన కంటికి కనిపించకుండా 'దాక్కుంది' అని తాజా పరిశోధనలో తేలింది. ఈ ఆవిష్కరణ ఖగోళ శాస్త్రంలో సూర్యుడిపై మనకున్న అవగాహనను మరింత మెరుగుపరచనుంది. 'ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్' అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలను ప్రచురించారు. వాస్తవానికి సూర్యుడిలో 98.5 శాతం హైడ్రోజన్, హీలియం వాయువులే ఉంటాయి. అయితే, వెండి లాంటి భార లోహాలు చాలా స్వల్ప పరిమాణంలో ఉన్నప్పటికీ, వాటిని అధ్యయనం చేయడం ద్వారా నక్షత్రాలు, గెలాక్సీల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవచ్చనేది శాస్త్రవేత్తల మాట. సూపర్‌నోవా పేలుళ్ల వంటి భారీ ఖగోళ సంఘటనల సమయంలో వెండి ఏర్పడుతుందని భావిస్తున్నారు. బెల్జియంలోని లీజ్ యూనివర్సిటీ పరిశోధకురాలు, ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన సేమా కాలిస్కాన్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. సుమారు 460 కోట్ల సంవత్సరాల క్రితం సూర్యుడు ఏర్పడిన పదార్థంతోనే పురాతన సీఐ కాండ్రైట్ ఉల్కలు కూడా ఏర్పడ్డాయి. కాబట్టి ఆ ఉల్కలలో ఉన్న వెండి పరిమాణమే సూర్యుడిలోనూ ఉండాలని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. కానీ, సూర్యుడి నుంచి వెలువడే కాంతిని విశ్లేషించిన ప్రతిసారీ వెండి స్థాయిలు చాలా తక్కువగా కనిపించాయి. ఈ రహస్యాన్ని ఛేదించడానికి కాలిస్కాన్ బృందం స్వీడన్‌లోని టెట్రాలిత్ సూపర్‌కంప్యూటర్‌ను ఉపయోగించి వెండి అణువులపై అత్యంత అధునాతన సిమ్యులేషన్లు నిర్వహించింది. గత అధ్యయనాలకు భిన్నంగా ఈ కొత్త నమూనాలో కాంతిని గ్రహించే విషయంలో అణువుల ప్రవర్తనపై ప్రభావం చూపే 'నాన్-ఈక్విలిబ్రియం ఎఫెక్ట్స్' అనే సంక్లిష్ట భౌతిక ప్రభావాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ప్రభావాల వల్లే వెండి పరిమాణం తక్కువగా నమోదైందని వారి సిమ్యులేషన్లు స్పష్టం చేశాయి. దీని ఆధారంగా మునుపటి అంచనాల కంటే సూర్యుడిలో సుమారు 55 శాతం ఎక్కువ వెండి ఉందని పరిశోధకులు నిర్ధారించారు. ఈ కొత్త లెక్క ఉల్కల్లోని వెండి స్థాయిలకు పూర్తిగా సరిపోలకపోయినా, చాలా దగ్గరగా ఉంది. దీంతో సూర్యుడిలో వెండి నిజంగా తక్కువగా ఉందనే వాదనకు బలం లేదని, అది కేవలం భౌతికశాస్త్ర ప్రభావాల వల్ల కనిపించని ఒక మాయ మాత్రమేనని స్పష్టమైంది.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
బుధవారం 29-07-2026

## భవన నిర్మాణ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందించిన జనసేన నాయకులు: ప్రేమ కుమార్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 28:** మంగళవారం ఏ.వి.బి పురం లో గత 2 వారాలుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో లేబర్ కార్డ్, ఈ-శ్రమ్ కార్డ్ నమోదు చేయించుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఇతర కార్మికులకు కూకట్పల్లి నియోజక వర్గం జనసేన పార్టీ కంటెస్ట్ ఎం.ఎల్.ఏ, పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భముగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్షణ ఇస్తాయని అన్నారు. ప్రతి కార్మిక కుటుంబానికి జనసేన ప్రార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, ఏ.వి.బి పురం జనసైనికులు టి. ప్రసాద్ రావు, వై.దనుజయ్, బి. రాము,జి. దుర్యోదన , డి కోటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్ రెడ్డి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం -- బండి రమేష్



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 28:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. బాలానగర్ వెంకటేశ్వర్ నగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో తనదైన శైలిలో బలంగా గళం విప్పారని అన్నారు. అపారమైన రాజకీయ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో దేశ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన నిజమైన ప్రజానాయకుడని కొనియాడారు. రాజకీయ చతురుడిగా, ట్రబుల్ షూటర్‌గా పేరొందిన జైపాల్ రెడ్డి ఎలాంటి క్లిష్ట సమస్య వచ్చినా చాకచక్యంగా పరిష్కార మార్గాన్ని చూపే నాయకుడని పేర్కొన్నారు. తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో బలంగా వినిపించడంలో, రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో కీలకమైందని బండి రమేష్ గుర్తు చేశారు. ఆయన ప్రజాసేవ, రాజకీయ విలువలు, నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, తూము సంతోష్, పులి శివగౌడ్, చంద్ర, నాగార్జున, క్రాంతి, నర్సింగ్, రాము, రమణ, జ్యోతి, శ్రీనివాస్, పార్వతి, ముస్తఫా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జైపాల్ రెడ్డి కి ఘనంగా నివాళులర్పించారు.

## ఆషాడ బోనాల జాతర సంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్న బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 28:** కుత్బుల్లాపూర్ ఎస్ ఎం, న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ మామిండ్ల సందీప్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి లోని ఏఎంఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన ఆషాడ మాస బోనాల జాతర సాంస్కృతిక ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న... బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి..ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, సుదర్శన్, జగన్, నర్సింగ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికను కాపాడిన ఆర్టీసీ

**నిజం న్యూస్ పటాన్ చెరువు, జూలై 28:** ఈరోజుల్లో .. మనకెందుకులే అనే స్వభావం చాలామందిలో ఉంటుంది కానీ, ఒక ఆర్టీసీ బస్సు (మిధాని డిపో) కండక్టర్ (శేఖర్), డ్రైవర్ (జె.ఎస్.కుమార్) చొరవ ఒక విద్యార్థిని కాపాడింది. పటాన్ చెరువులోని తెలంగాణ మైనారిటీ గురుకులం విద్యార్థిని అనూహ్యంగా పటాన్ చెరువు వద్ద ఆర్టీసీ బస్సు (నెం.218) ఎక్కింది. చేతిలో పది రూపాయల నోటు తప్ప ఆ బాలిక వద్ద ఏమి లేవు, కాళ్లకు చెప్పులు కూడా లేవు కండక్టర్ టికెట్ అడిగినప్పుడు దీనంగా అదోరీతిలో చూసింది. కండక్టర్కు అనుమానం వచ్చింది, విషయన్ని డ్రైవర్ కు చెప్పాడు, ఇద్దరూ ఆ అమ్మాయిని కనిపెడుతూనే ఉన్నారు. పక్కన ఉన్న ప్యాసింజర్ వద్ద ఫోన్ తీసుకొని ఆ అమ్మాయి ఎవరికో మాట్లాడింది ఆ నెంబర్ ఆధారంగా ఆఅమ్మాయి మైనారిటీ గురుకులం విద్యార్థిగా నిర్ధారణ అయింది. దాంతో తోటి ప్రయాణికులకు చెప్పడంతో ఆఅమ్మాయి వెనుక నుంచి కదులుతున్న బస్సులోంచి దిగేందుకు ప్రయత్నించింది ప్రయాణికులు అందరూ ఆమెను పట్టుకొని, సముదాయించి చివరకు సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరిగింది. ఈఉదంతంలో తెలంగాణ ఆర్టీసీ అన్నలు చూపిన చొరవ అభినందనీయం

## ఎస్.ఐ. ఆర్ నమోదులో యువకులు చురుకుగా పాల్గొనాలి

చందానగర్ ప్రజ్ఞా డిగ్రీ అండ్ పీ.జీ కాలేజ్ లో ఎస్.ఐ. ఆర్ అవగాహన సదస్సు

విద్యార్థులు తమ తల్లి తండ్రులు మరియు వారి బంధువులకు ఎస్.ఐ. ఆర్ నమోదులో సహకరించాలి..

మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి.




**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి జూలై 28:** చందానగర్ డివిజన్ ప్రజ్ఞా డిగ్రీ అండ్ పి.జీ కాలేజ్ లో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఎస్.ఐ. ఆర్ అవగాహన కల్పించడం జరిగినది. చదువుకునే విద్యార్థులు ఓటు ఉన్న వారు ఎస్.ఐ. ఆర్ కార్యక్రమంలో ఓటు నమోదు చేసుకోవాలని, వారి తల్లితండ్రులకు,బంధువులకు ఫారం నింపడం లో సహాయ సహకారాలు అందించాలని.మీ ఓటు... మీ హక్కు. మీ బాధ్యత అని ప్రతి ఒక్కరు గ్రహించాలని,భారత ఎన్నికల సంగం చేపట్టిన ఎస్.ఐ. ఆర్ కార్యక్రమంలో అర్హులైన ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధ్రువికరించుకోవలని,ఇతరులకు కూడా సహకరించాలని,ఓటు హక్కు కలిగి ఉంటేనే ప్రజాసౌమ్యం పరిరక్షణలో, సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయి అని,అందుకే ప్రతి ఒక్కరు ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంన్నీ విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో దీ=హాఎ రాజు, చందర్ రావు,సలీం,శభన బేగం, శ్రీనివాస్(బాబులు),నగేష్ రెడ్డి,వంశీ రెడ్డి,జె.వీ.రావు అనంత రెడ్డి,అంజి యాదవ్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి అధ్యక్షుడు ఎర్ర యాకన్నకి, ప్రధాన కార్యదర్శి అంజిబాబుకి ఘనంగా సన్మానం

శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు తెలిపిన గుమ్మడి రాజలింగం ఫౌండేషన్, శ్రేష్ట ఐ క్లినిక్ అధినేత డాక్టర్ గుమ్మడి కిరణ్.



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 28:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా ఎన్నికైన ఎర్ర యాకన్నకి, అలాగే ప్రధాన కార్యదర్శిగా (జనరల్ సెక్రటరీ) నాగుల అంజిబాబుకి గుమ్మడి రాజలింగం ఫౌండేషన్, శ్రేష్ట ఐ క్లినిక్ అధినేత డాక్టర్ గుమ్మడి కిరణ్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుమ్మడి కిరణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు సమాజానికి సేవ చేసే దిశగా ఎర్ర యాకన్న సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలని ఆకాంక్షించారు. కూకట్పల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆయన జర్నలిజం రంగంలో చేస్తున్న సేవలను అందరూ ప్రశంసించారు. సమాజంలో జరుగుతున్న అంశాలను ప్రజలకు నిజాయితీగా చేరవేస్తున్న జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి సీనియర్ జర్నలిస్ట్ పుట్టి నగేష్, అనిల్ కిషోర్,శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్లో మహిళా పోలిస్టేషన్ ఎప్పుడు..???

హోం మంత్రి పై అధికారులు ఆలోచించాలి...

ఆర్మూర్ పోలిస్టేషన్ లో తలనొప్పిగా మారిన భార్యభర్తల కేసులు...

మహిళా పోలిస్టేషన్ ఉంటే కొంతమేరకు ఉపాషమనం..

ఆర్మూర్ డివిజన్ ప్రజలకు భార్య భర్తలకు, మహిళలకు కచ్చితంగా అవసరం మహిళా పోలిస్టేషన్...




**జూలై 28 నిజం న్యూస్:** ఆర్మూర్ పట్టణ కేంద్రంలో మహిళ పోలీస్ స్టేషన్ కావాలని ప్రజలు, మేధావులు, ప్రతినిధులు, కోరుతున్నారు. ఎందుకంటే ఆర్మూర్ డివిజన్ గా మారింది. అన్ని మండలాలు ఆర్మూర్ కు సెంట్రల్ పాయింట్ అయ్యింది. ప్రధాన డివిజన్ గా మారినందున ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో ఎక్కువగా భార్య భర్తల కేసులు వస్తున్నాయి. అవి ఎలాంటి కేసులు అంటే భార్యాను భర్త కొట్టాడు లేదా భర్తను భార్య కొట్టింది. అనే కేసులే ప్రధానంగా ఎక్కువగా వస్తున్నాయి. పోలీస్ స్టేషన్లో భార్యాభర్తల పంచాయతీలు... వాళ్ళ సమస్యలు పరిష్కరించడానికి, వాళ్లను సముదాయించడానికి సమయం సరిపోతుంది. అందువలన ఆర్మూర్లో ప్రధానమైన దొంగల కు టైం ఆసరా అవుతుంది.దొంగలను పట్టుకొనుటకు లేదా ఆలోచన ఎక్కువగా జరగడం లేదు. ఆర్మూర్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారిని పట్టుకోవడానికి ఎక్కువ సమయాన్ని కేటాయించవలసి ఉంది. అయితే మహిళ పోలీస్ స్టేషన్ ఉంటే మహిళలకు, భార్య భర్తలకు అన్ని విధాల సమస్యలకు కౌన్సిలింగ్ చేస్తే పరిష్కారం దొరికే అవకాశం ఉంది.. కాబట్టి ఆర్మూర్లో అనేకమైన గొడవలు ఎక్కువగా భార్యాభర్తల సమస్యలే వస్తున్నాయి. అలాగే ఆర్మూర్ రూరల్ నుండి గ్రామాలలో నుండి కూడా భార్య భర్తల గొడవలు లేదా కేసులు ఎక్కువగా వస్తున్నాయి. అట్టి కంప్లైంట్లు కేసులు పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరుగుతున్నారు. ఆర్మూర్ పిఎస్ కు తలనొప్పిగా మారిన భార్య భర్తల గొడవలు. కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి రాష్ట్ర హోం మంత్రి, ఇట్టి విషయాలను పరిగణలోనికి తీసుకొని ఆర్మూర్లో మహిళ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని పలువురు నాయకులు అధికారులు కోరుతున్నారు మహిళా లకు సరైన న్యాయం దొరకాలంటే మహిళా పోలీస్ స్టేషన్ కు ఆర్మూర్ నుండి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే గాని మహిళ పోలీస్ స్టేషన్ కు వెళ్లలేము. మహిళలు నమ్మకమైన బాధలను, చెప్పుకోలేని విషయాలను కూడా మహిళా పోలీస్ స్టేషన్ లో మహిళ పోలీసులకు చెప్పే అవకాశం ఉంటుంది. సదరు పోలీస్టేషన్లో పురుషులు ఉంటారు.. కాబట్టి మహిళలు చెప్పుకోవడానికి వెనుకడుగు వేస్తూ ఉంటారు. వారి బాధను సరిగ్గా అర్థం చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది.

**కాబట్టి సరైన మార్గం..**

మహిళా పోలీస్ స్టేషన్... ఆర్మూర్లో ఉంటే సెంట్రల్ గా ఉంటుంది. చుట్టూ 30 ఊర్ల పెట్టు జనం అందరూ భార్యాభర్తల కేసులు గాని, మహిళల గొడవలు గాని.. అలాంటి విషయాలను సాఫీగా మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి పై పోలీస్ శాఖ అధికారులు గానీ, రాష్ట్ర హోంశాఖ మంత్రి గాని ఆర్మూర్లో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి జీవోను లేదా నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.ఆర్మూర్ ను ఒక సెంట్రల్ పాయింట్ గా గుర్తించాలి. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఆర్మూర్ మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్మూర్ మహిళలు, ప్రజలు, మేధావులు, ప్రతినిధులు కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి ఒక మంచి మార్గాన్ని మహిళలకు చూపెట్టాల్సిందిగా పై పోలీస్ శాక అధికారులను కోరుతున్నారు. ప్రజలు మహిళలు పోలీసులు కూడా కోరుతున్నారు.

# వరిధాన్యం బస్తాలకు గోదాముగా షాదీఖానా

అధికారుల నిర్లక్ష్యంపై టిజెఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా ఆగ్రహం



వనపర్తి బ్యూరో **జూలై 28 నిజం న్యూస్:** వనపర్తి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వంలో 2.80 కోట్లతో నిర్మించిన షాదీఖానా వరిధాన్యం బస్తాలకు వాడుకుంటున్నా గోదామా అటు అధికారుల నిర్లక్ష్యంపై టిజెఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుభకార్యాల కోసం కట్టిన భవనంలో వరి బస్తాలు పెట్టడం దారుణం జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి భవనాన్ని ఖాళీ చేయించి తక్షణమే ఉర్దూ ఘర్ -- షాదీఖానాను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేకపోతే ఆందోళనలు తప్పవు అని హెచ్చరించారు.కష్టపడి సంపాదించిన ప్రజాధనం రూ. 2.80 కోట్లతో ఎంతో సుందరంగా నిర్మించిన ఉర్దూ ఘర్, షాదీఖానాను ప్రారంభించకుండా, దాన్ని వరి ధాన్యం బస్తాలు నిల్వ ఉంచే గోదాముగా మార్చడం అత్యంత దుర్మార్గమైన చర్య అని తెలంగాణ జనసమితి (టిజెఎస్) వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మూడు, నాలుగు సంవత్సరాల క్రితమే నిర్మాణం పూర్తయినా, నేటికీ ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం అధికారుల, ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట అని మండిపడ్డారు. పేద, మధ్యతరగతి ప్రజలు, మైనారిటీలు తమ శు భకార్యాలు, సభలు జరుపుకోవడానికి ఉపయోగపడాల్సిన భవనంలో వరి బస్తాలు పడేయడం ఏంటి అని ప్రశ్నించారు. ఇది ఉర్దూ ఘర్ నిర్మాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని నీరుగార్చడమేనని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని, షాదీఖానాలో అక్రమంగా నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను తక్షణమే వేరే ప్రాంతానికి తరలించి భవనాన్ని ఖాళీ చేయించాలి. వెంటనే ప్రారంభించాలి: ఎలాంటి వంకలు చెప్పకుండా, ఆ భవనాన్ని తక్షణమే ప్రారంభించి నిరుపేద ప్రజలు, మైనారిటీల వినియోగంలోకి తీసుకురావాలి. భవన పరిరక్షణ: పర్యవేక్షణ లేక రూ. కోట్ల విలువైన కట్టడం శిథిలావస్థకు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఇప్పటికైనా నిద్ర మత్తు వదిలి తక్షణమే స్పందించకపోతే మైనార్టీలు మరియు స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఖాదర్ పాషా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఖాదర్ బాషా,గండు శివ, రతన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బస్ భవన్ ముట్టడి జయప్రదం చేయాలి

తెలంగాణ రాష్ట్ర అర్టిసి విశ్రాంత ఉద్యోగుల ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

జిల్లా గౌరవ అధ్యక్షులు వాకిటి శ్రీధర్ డిమాండ్



వనపర్తి బ్యూరో **జూలై 28 నిజం న్యూస్:** వనపర్తి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి సత్యన్న, కార్యనిర్వాహక అధ్యక్షులు రాంచంద్రారెడ్డితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 4 వ తేది హైదరాబాద్ బస్ భవన్ ముట్టడి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఉద్యోగుల సాధన, భద్రత కోసం భారీ నిరసన కార్యక్రమము జరుప తలపెట్టామని దీనికి కార్మికులందరూ అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు 2017 సం॥ నుండి 2021 ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలి. మంగళవారం వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ ను చెల్లించాలి. సూపర్ లగ్జరీ బస్సులో భార్యాభర్తలకు ఇరువూరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి, తార్నాక ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం కల్పిస్తూ రోగులకు రెండు నెలలకు సరిపడు మందులు ఇవ్వాలి. డిమాండ్ చేశారు బస్సు భవన్ ముట్టడితో యాజమాన్యం దిగి రాకపోతే ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో కె. సత్యన్న, రాంచంద్రారెడ్డి, రామ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, యస్. యం. అలి, లక్ష్మినారాయణ, స్వామి గౌడ్, గోపాల్ రెడ్డి తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షిద్దాం

వృక్షో రక్షతి రక్షితః

పిల్లలను ఎలా జాగ్రత్తగా పెంచుతామో ,మొక్కలను అలాగే జాగ్రత్తగా పెంచాలి... బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్



**నిజం న్యూస్ శేరిలింగంపల్లి ప్రతినిధి, జూలై 28:** మంగళవారం శ్రీ సనాతన ఆయుర్వేద, శ్రీ సరస్వతి దేవి అనురాగధార ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో కొండాపూర్ గ్రీన్ గార్డియన్స్ పేరుతో ప్రతి కమ్యూనిటీ మరియు ప్రతి కాలనీలో మొక్కలు నాటాలనే సదుద్దేశంతో మసీద్ బండ క్యామ్లాట్ లేఅవుట్ పార్క్ వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో 8 వ బెటాలియన్ కమాండెంట్ ఎస్పీ రామకృష్ణ గారు, డీఎస్పీ రాంబాబు గార్లతో కలిసి మొక్కలు నాటడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ పెద్ద పెద్ద నిర్మాణాలు చేపడుతూ అంతా కాంక్రీట్ అడవిలా మారుతుందని ఇలాంటి తరుణంలో, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని ప్రతి కమ్యూనిటీ, ప్రతి కాలనీ లో మొక్కలు నాటాలనే లక్ష్యంతో నేడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు శ్రీ సనాతన ఆయుర్వేద, శ్రీ సరస్వతి దేవి అనురాగధార ఫౌండేషన్ లకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, చెట్లు ప్రకృతికి ప్రాణాధారం అని, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిస్తూ, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు వాటిని కాపాడటం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని, మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పచ్చదనం కొరకు అమ్మ పేరుతో ఒక చెట్టు నాటే కార్యక్రమం, పరిసరాల శుభ్రత కొరకు స్వచ్ఛ భారత్ ఎలా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, అదే స్ఫూర్తితో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సనాతన ఆయుర్వేద చైర్మన్ లక్ష్మీ ,శివాజీ యువసేన అధ్యక్షుడు యోగేష్ ప్రభు, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, రెడ్ క్రాస్ యూత్ కన్వీనర్ మణిదీప్, వర్టికల్ వరల్డ్ ఫౌండర్ సుకుమార్ దాస్, భాగ్యనగర్ బిజీవైం స్పోక్స్ పర్సన్ నవీన్ కుమార్ ,సిద్దిపేట యూత్ అధ్యక్షులు అనూప్ కుమార్,పవన్ శర్మ,మేరీ, జ్యోతి ,మీనమ్మ, కల్పన, మసీద్ బండ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు,

## కొనుగోలుదారులకు భారీ రిలీఫ్ ఇచ్చిన పసిడి ధర..! హైదరాబాద్‌లో తులం ఎంత పలుకుతుందంటే..?



పుత్తడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. మంగళవారం ధరలు తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.800 తగ్గి పది గ్రాములకు రూ.98,500 పలుకుతున్నది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ సైతం ధ్రువీకరించింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర సైతం రూ.800 తగ్గడంతో తులానికి రూ.98వేలు పలుకుతుందని పేర్కొంది. అదే సమయంలో వెండి ధరలు సైతం భారీగానే పడిపోయాయి. రూ.1,370 తగ్గి.. కిలోకు రూ.99వేలు పలుకుతున్నది. వెండి సోమవారం కిలోకు రూ.లక్షపైగానే ట్రేడ్ అయ్యింది. యుఎస్, బ్రస్సెల్స్ మధ్య వాణిజ్య చర్చలు ధరలపై ప్రభావం చూపాయి. మరో వైపు ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 45.03 తగ్గి ఔన్సుకు 3,296.92 చేరాయి. అమెరికాతో వాణిజ్య చర్చలను వేగవంతం చేయాలని బ్రస్సెల్స్ ఒత్తిడి చేస్తుండడంతో విలువైన లోహానికి డిమాండ్ స్వల్పంగా తగ్గిందని కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు. సుంకాలు, ద్రవ్యోల్బణం ఆందోళనల మధ్య పెట్టుబడిదారులు యూఎస్ డ్యూరబుల్ గూడ్స్ ఆర్డర్ అండ్ కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ డేటాపై దృష్టి సారించారని.. డేటాలోని గణాంకాలు ఆర్థిక దృక్పథం గురించి మరింత సమాచారం తెలుస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల పసిడి రూ.89,950 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.98,130 పలుకుతున్నది. కిలో వెండి రూ.1.11లక్షలుగా ఉన్నది. ఇక ప్లాటినం తులం ధర రూ.29,930 వద్ద కొనసాగుతున్నది.

## వోల్వో కార్ల కంపెనీలో 3000 మంది ఉద్యోగుల తొలగింపు




స్వీడెన్‌కు చెందిన వోల్వో కార్ల కంపెనీ సుమారు మూడు వేల మంది ఉద్యోగులను తొలగించనున్నది. ఖర్చులను తగ్గించే ఉద్దేశంతో ఆ కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నది. వాణిజ్య ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చిత వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొన్నది. స్వీడెన్‌లో ఉన్న సుమారు 1200 మంది వర్కర్లను తొలగించనున్నారు. ఇక ఆ దేశంలోనే పనిచేస్తున్న మరో వెయ్యి మంది కన్సల్టెంట్లను కూడా తొలగించేందుకు ఆ కంపెనీ నిర్ణయించింది.ఇక మిగితా జాబ్‌లన్నీ ఇతర దేశాల్లో ఊడనున్నాయి. ఎక్కువ శాతం ఆఫీసు పొజిషన్లలో ఉన్నవారిని తొలగిస్తారు. తాము ప్రకటించిన నిర్ణయాలు కష్టమైనవని, కానీ బలమైన నిర్మాణంచేపట్టేందుకు అవే కీలకమైన అడుగులు అని వోల్వో కార్ల కంపెనీ సీఈవో హకన్ సామ్యుల్సన్ తెలిపారు. ఆటోమోటివ్ పరిశ్రమ సవాళ్లను ఎదుర్కొంటున్నదని, నగదు రాకను పెంచాలని, అదే విధంగా ఖర్చులను తగ్గించాలన్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 625 పాయింట్లు డౌన్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలో మిశ్రమ ఫలితాలతో పాటు కీలక రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఫలితంగా మార్కెట్లు పతనమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,038.20 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సెన్సెక్స్ నష్టాల్లోకి జారుకుంది. కొద్దిసేపటికి కోలుకోగా.. మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. అమ్మకాల ఒత్తిడితో ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. ఇంట్రాడేలో 82,410.52 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. కనిష్టంగా 81,121.70 పాయింట్లకు తగ్గింది. చివరకు 624.82 పాయింట్లు పతనమై.. 81,551.63 వద్ద కొనసాగుతున్నది. నిఫ్టీ 174.95 పాయింట్లు పతనమై.. 24,826.20 వద్ద స్థిరపడింది. దాదాపు 1893 షేర్లు లాభపడగా.. 1898 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో జియో ఫైనాన్షియల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ట్రెంట్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, నెస్లే, భారత్ ఎలక్ట్రిక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్, గ్రాసిమ్, ఎన్‌టీపీసీ, ఎంఅండ్‌ఎం, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫిన్‌సర్వ్, టీసీఎస్, ఐసీఐసీఐ, రిలయన్స్, ఎక్స్‌టర్నల్, విప్రో తదితర షేర్లు నష్టపోయాయి. రంగాలవారీగా.. నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ 0.9 శాతం పతనమైంది. ఆటో, నిఫ్టీ ఐటీ 0.7 శాతం మేరకు పతనమయ్యాయి. ఆయిల్-గ్యాస్ సూచీలు 0.6 శాతం పడిపోగా.. మెటల్ 0.5 శాతం తగ్గగా.. పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ 0.25శాతం పెరిగాయి.

## ఈ ఏడాది 5 వేల నియామకాలు గుడ్‌న్యూస్ చెప్పిన ఇ-కామర్స్ దిగ్గజం




ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే, వాల్‌మార్ట్‌కు చెందిన ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మాత్రం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది వేల సంఖ్యలో నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది 5 వేల మందిని నియమించుకోనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తాజాగా కంపెనీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్లిప్‌కార్ట్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సీమా నాయర్ ఈ నియామక ప్రణాళికలను ప్రకటించారు. క్విక్ కామర్స్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తరణపై దృష్టి సారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 'మినిట్స్' పేరిట క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న ఫ్లిప్‌కార్ట్ తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తోంది. వినియోగదారులకు వేగవంతమైన డెలివరీ సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. యూపీఐ (%ఖూ×%) పేమెంట్స్ జరిపేందుకు సూపర్.మనీ (%బాబజూవతీ.ఎశీఅవ౦%) పేరుతో తీసుకొచ్చిన అప్లికేషన్‌పై దృష్టి సారించింది. ఈ విభాగాల్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నూతన నియామకాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## లక్ష రూపాయల్లో లక్షణమైన ఈవీ బైక్స్.. ది బెస్ట్ బైక్స్ ఇవే..!



ఏప్రిల్ 2025లో రిటైల్ గణాంకాల ఆధారంగా 58 శాతం వాటాతో ఈవీ మార్కెట్‌లో ద్విచక్ర వాహనాలు హల్‌చల్ చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, వాణిజ్య వాహనాలతో సహా మొత్తం ఈవీ విభాగం సంవత్సరానికి 17 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగం మొదటిసారిగా 1 మిలియన్ అమ్మకాలను సాధించింది. అలాగేసంవత్సరానికి 21 శాతం బలమైన వృద్ధిని చూసింది. ఈ విభాగంలో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. కానీ మార్కెట్లో ఆల్-ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో లక్ష రూపాయల లోపు అత్యంత సరసమైన ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లపై ఓ లుక్కేద్దాం.

### రివోల్ట్ మోటార్స్ ఆర్‌వీ1

రివోల్ట్ మోటార్స్ ఆర్‌వీ1 మోటర్ బైక్ ధర రూ. 90,000గా ఉంటుంది. రివోల్ట్ మోటార్స్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ విభాగంలో అగ్రగామిగా ఉంది. ఈ కంపెనీ ఐదు ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను అందిస్తుంది. రివోల్ట్ ఆర్‌వీ1, రివోల్ట్ ఆర్‌వీ1o, రివోల్ట్ బ్లేజ్‌ఎక్స్, రివోల్ట్ ఆర్‌వీ400 బీఆర్‌జెడ్, రివోల్ట్ ఆర్‌వీ400. రివోల్ట్ మోటార్స్ లైనప్‌లో అత్యంత సరసమైన వాహనం అయిన రివోల్ట్ ఆర్‌వీ1 నిలుస్తుంది. ఈ బైక్ 2.2 కేడబ్ల్యూహెచ్ లిథియం-అయాన్ బ్యాటరీ సామర్థ్యంతో 2.8 కేడబ్ల్యూహెచ్ మోటారును కలిగి ఉంది. ఆర్‌వీ 12 గంటల 15 నిమిషాల్లో 0-80 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఓ సారి చార్జ్ చేస్తే 100 కి.మీ.లేజ్ ఇస్తుంది. ఈ కంపెనీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్, బ్యాటరీపై 5 సంవత్సరాలు లేదా 75,000 కి.మీ.ల వారంటీని అందిస్తోంది. అలాగే ఛార్జర్‌పై 2 సంవత్సరాల వారెంటీ అందిస్తుంది.

### ఒబెన్ రోర్ ఈజెడ్

ఒబెన్ రోర్ ఈజెడ్ ఈవీ బైక్ ధర రూ. 90,000గా ఉంది. ఒబెన్ రోర్ ఈజెడ్ బైక్ 2.6 కేడబ్ల్యూహెచ్ 3.4 కేడబ్ల్యూహెచ్, 4.4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్స్ వస్తుంది. 2.6 కేడబ్ల్యూహెచ్ మోడల్ ధర రూ. 90,000. ఈ బైక్ 52 శ్రీన్‌ఎం టార్క్ తో 7.5 కేడబ్ల్యూహెచ్ (10 %ఎష్ట్రజూ%) అవుట్‌పుట్‌తో వస్తుంది. ఈబైక్ 95 కిలోమీటర్ల వేగతంతో దూసుకుపోతుంది. కేవలం 3.3 సెకన్లలో 0 %-% 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ బైక్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 110 కి.మీ పరిధిని అందిస్తుంది. ఈ బైక్‌ను 2 గంటల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతుంది. ఈ బైక్‌కు 8 సంవత్సరాలు లేదా 80,000 కి.మీ క్లాస్-లీడింగ్ బ్యాటరీ వారంటీ ఉంది. ఓలా రోడ్‌స్టర్ ఎక్స్

### ఓలా రోడ్‌స్టర్ ఎక్స్

ఓలా రోడ్‌స్టర్ ఎక్స్ ఈవీ బైక్ ధర రూ. 99,999గా ఉంది. ఈ బైక్ మూడు బ్యాటరీ ఎంపికలతో అందుబాటులో ఉంటుంది. 2.5 కేడబ్ల్యూహెచ్, 3.5 కేడబ్ల్యూహెచ్, 4.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎంపికల్లో ఈ బైక్‌ను కొనుగోలు చేయవచ్చు. 2.5 కేడబ్ల్యూహెచ్ వెర్షన్ ఓ సారి చార్జ్ చేస్తే 140 కి.మీ మైలేజ్ అందిస్తుంది. అలాగే ఈ బైక్ 7 కేడబ్ల్యూ గరిష్ట శక్తిని అందుకుంటుంది. ఛార్జింగ్ విషయానికి వస్తే ఈ బైక్ 6.2 గంటల్లో 0 %-% 80 శాతం వరకు చార్జ్ అవుతుంది. ఈ బైక్ కేవలం 3.4 సెకన్లలో 0 %-% 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఓలా ఎలక్ట్రిక్ ఈ బైక్‌కు 3 సంవత్సరాలు లేదా 50,000 కి.మీ బ్యాటరీ వారంటీని అందిస్తోంది.

### ప్యూర్ ఈవీ ఎకో డ్రిఫ్ట్ జెడ్

ప్యూర్ ఈవీ ఎకో డ్రిఫ్ట్ జెడ్ ధర రూ. 99,999 నుంచి ప్రారంభం అవుతుంది. ఎకో డ్రిఫ్ట్ 3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 3 కేడబ్ల్యూ (4 బీహెచ్‌పీ) గరిష్ట అవుట్‌పుట్, 2 కేడబ్ల్యూ (2.6 బీహెచ్‌పీ) అవుట్‌పుట్‌తో పని చేస్తుంది. ప్యూర్ ఈవీ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది. ఈ బైక్ 5 సెకన్లలో 0 %-% 40 కిలోమీటర్లు, 10 సెకన్లలో 0 %-% 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ బైక్ 3 గంటల్లో 20 %-% 80 శాతం, 6 గంటల్లో 0 %-% 100 శాతం ఛార్జ్ అవుతుంది. ఈ బైక్‌లో మూడు రైడ్ మోడ్‌లు ఉంటాయి.

## కొత్తగా ఉద్యోగం వచ్చిందా? ఆ పని వెంటనే చేయమంటున్న నిపుణులు



కొత్తగా ఉద్యోగం పొందిన వారు కచ్చితంగా ఆర్థిక ప్రణాళిక రచించుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీ కారణంగా ఫోన్‌లోనే పెట్టుబడి యాప్‌లతో పాటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల పెరుగుదల కారణంగా చాలా సులభంగా పెట్టుబడి రుణం తీసుకోవచ్చని చెబుతున్నారు. అయితే ఈ పెట్టుబడి అనేది బీమా పాలసీల్లో పెడితే మంచి లాభాలు ఉంటాయని సూచిస్తున్నారు. జీవిత బీమా లేదా ఆరోగ్య బీమా వంటి పథకాల్లో పెట్టుబడి మంచి నిర్ణయం అయిన సూచిస్తున్నారు. ఈ పెట్టుబడులు పన్ను నిర్వహణ విషయంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటున్నారు.

### ముందుగానే ప్రారంభించడం

కెరీర్ తొలి సంవత్సరాలు పెట్టుబడులకు కీలకమైనవిగా ఉంటాయి. ఈ సమయంలోనే సరైన ఆర్థిక అలవాట్లను పెంపొందించుకుంటే జీవితాంతం ప్రయోజనాలను అందిస్తాయి. ఆకస్మిక వైద్య అత్యవసర పరిస్థితులు, ఉద్యోగ నష్టం లేదా ప్రమాదాల వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల నుంచి మంచి బీమా పథకం రక్షణ కల్పిస్తుంది. ఇంటిని కొనడం, వ్యాపారాన్ని ప్రారంభించడం లేదా ముందస్తు పదవీ విరమణ కోసం ప్రణాళిక వంటి ప్రధాన జీవిత లక్ష్యాలను సాధించడానికి పునాది వేస్తుంది. ముఖ్యంగా ప్రతి నెలా రూ.5,000 పెట్టుబడి పెట్టడం వల్ల పదవీ విరమణ సమయంలో 35 ఏళ్ల వ్యక్తి కంటే రెండింతలు ఎక్కువ సంపదను పొందవచ్చు.

### రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం

భారతదేశంలో బీమాను తరచుగా తప్పుగా అర్థం చేసుకుంటారు. అందువల్ల బీమా విషయంలో ఎవరూ సరైన నిర్ణయం తీసుకోరు. అయితే బీమా పథకం అనేది ఆర్థిక రక్షణకు ముఖ్యమైన మార్గం. ముఖ్యంగా ప్రతి ఉద్యోగికి ఆరోగ్య బీమా చాలా కీలకం. కంపెనీ ఇచ్చే ఆరోగ్య బీమాపై మాత్రమే ఆధారపడకుండా వ్యక్తిగతంగా కూడా ఆరోగ్య బీమా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇలా చేస్తే ఉద్యోగ మార్పులతో సంబంధం లేకుండా నిరంతర కవరేజీని పొందవచ్చని పేర్కొంటున్నారు. అలాగే టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా తీసుకోవాలని చెబుతున్నారు.

### పెట్టుబడులను ప్లాన్ చేయడం

పెట్టుబడులు ఉన్నత లక్ష్యాలతో ఉద్దేశపూర్వకంగా చేస్తే మంచి ఫలితాన్ని పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. బీమా పథకాలు అంటే కేవలం పన్నులను ఆదా చేయడానికి మీరు చేసేవి కావు. ప్రతి యువకుడు ఆర్థిక లక్ష్యాలను మ్యాప్ చేయడం ద్వారా బీమా పాలసీలను ప్రారంభించాలని చెబుతున్నారు. అత్యవసర నిధిని నిర్మించడం వంటి స్వల్పకాలిక, వాహనం లేదా ఆస్తిని కొనుగోలు చేయడం వంటి మధ్యకాలిక లేదా పదవీ విరమణ వంటి దీర్ఘకాలిక. లక్ష్యాలను నిర్వచించిన తర్వాత సరైన పెట్టుబడి సాధనాలను ఎంచుకోవడం చాలా సులభం అవుతుంది. బీమాతో పాటు పీపీఎఫ్, ఎస్ఐపీ, స్టాక్ మార్కెట్, యూలిప్ వంటి స్కీమ్స్ పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు.

## అధిక రాబడి కోసం చూస్తున్నారా? పోస్టాఫీసులు అద్భుతమైన స్కీమ్స్!







పోస్టాఫీసులో రకరకాల పథకాలు అందుబాటులో ఉన్నాయి. మంచి రాబడి పొందేందుకు, మీ డబ్బుకు ఎలాంటి రిస్క్ లేకుండా ఉండేందుకు పోస్టాఫీసులు అద్భుతమైన పథకాలు ఉన్నాయి. ఇందులో ఇన్వెస్ట్ చేస్తే మంచి వడ్డీ రేటు వస్తుంది. అంతేకాదు పన్ను మినహాయింపు సదుపాయం కూడా ఉంటుంది.. పోస్టల్ సేవింగ్స్ ఖాతా: ఈ పథకం కనీసం రూ.500 నుండి పెట్టుబడి పెట్టవచ్చు. వడ్డీ రేటు సంవత్సరానికి 4 శాతం. ఇది బ్యాంకు ఖాతా లాగా పనిచేస్తుంది. అలాగే తక్కువ వడ్డీ రిస్క్‌తో సురక్షితమైన పొదుపు ఎంపిక. ఒక వ్యక్తికి ఒకసారి మాత్రమే ఖాతా తెరవడానికి అనుమతి ఉంది. మనం వరుసగా మూడు సంవత్సరాలు చెల్లించకపోతే, ఖాతా రద్దు అవుతుంది. సంబంధిత పత్రాలను సమర్పించడం ద్వారా మీరు మీ ఖాతాను కూడా పునరుద్ధరించవచ్చు.

పోస్టల్ సేవింగ్స్ ఖాతా: ఈ పథకం కనీసం రూ.500 నుండి పెట్టుబడి పెట్టవచ్చు. వడ్డీ రేటు సంవత్సరానికి 4 శాతం. ఇది బ్యాంకు ఖాతా లాగా పనిచేస్తుంది. అలాగే తక్కువ వడ్డీ రిస్క్‌తో సురక్షితమైన పొదుపు ఎంపిక. ఒక వ్యక్తికి ఒకసారి మాత్రమే ఖాతా తెరవడానికి అనుమతి ఉంది. మనం వరుసగా మూడు సంవత్సరాలు చెల్లించకపోతే, ఖాతా రద్దు అవుతుంది. సంబంధిత పత్రాలను సమర్పించడం ద్వారా మీరు మీ ఖాతాను కూడా పునరుద్ధరించవచ్చు.

1 / 6

రికరింగ్ డిపాజిట్ (%=ణ%): ఈ పథకం సంవత్సరానికి 6.7 శాతం వడ్డీని సంపాదిస్తుంది. కనీసం నెలకు రూ.100 చొప్పున 5 సంవత్సరాల పాటు చెల్లించాలి. మన ఆదాయం ఆధారంగా నెలవారీగా ఎంత చెల్లించాలో నిర్ణయించుకోవచ్చు. ఈ పథకం సంవత్సరానికి 6.7 శాతం వడ్డీని సంపాదిస్తుంది. నెలవారీ ఆదాయంపై ఆధారపడే మధ్యతరగతి కుటుంబాలకు అనువైన నెలవారీ పొదుపు పథకం ఇది. ఈ పథకంలో చేరిన 1 సంవత్సరం తర్వాత మీరు ఖాతాలోని మొత్తంలో 50 శాతం వరకు పొందవచ్చు. ఈ పథకంలో చేరిన 3 సంవత్సరాల తర్వాత మీరు ఖాతాను మూసివేసి మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. రికరింగ్ డిపాజిట్ (%=ణ%): ఈ పథకం సంవత్సరానికి 6.7 శాతం వడ్డీని సంపాదిస్తుంది. కనీసం నెలకు రూ.100 చొప్పున 5 సంవత్సరాల పాటు చెల్లించాలి. మన ఆదాయం ఆధారంగా నెలవారీగా ఎంత చెల్లించాలో నిర్ణయించుకోవచ్చు. ఈ పథకం సంవత్సరానికి 6.7 శాతం వడ్డీని సంపాదిస్తుంది. నెలవారీ ఆదాయంపై ఆధారపడే మధ్యతరగతి కుటుంబాలకు అనువైన నెలవారీ పొదుపు పథకం ఇది. ఈ పథకంలో చేరిన 1 సంవత్సరం తర్వాత మీరు ఖాతాలోని మొత్తంలో 50 శాతం వరకు పొందవచ్చు. ఈ పథకంలో చేరిన 3 సంవత్సరాల తర్వాత మీరు ఖాతాను మూసివేసి మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు.

2 / 6




టైమ్ డిపాజిట్: ఈ పథకం కాలపరిమితిని బట్టి, సంవత్సరానికి 6.9 శాతం నుండి 7.5 శాతం వరకు వడ్డీని అందిస్తుంది. అలాగే, మీరు 5 సంవత్సరాల ప్రణాళికలో చేరితే సెక్షన్ 80%జ% కింద మీకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ పథకం బ్యాంకులతో సమానంగా వడ్డీని అందిస్తుంది. 6 నెలల తర్వాత అవసరమైతే మీరు కొంత మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. కానీ దానిపై వడ్డీ వసూలు చేస్తారు.

టైమ్ డిపాజిట్: ఈ పథకం కాలపరిమితిని బట్టి, సంవత్సరానికి 6.9 శాతం నుండి 7.5 శాతం వరకు వడ్డీని అందిస్తుంది. అలాగే, మీరు 5 సంవత్సరాల ప్రణాళికలో చేరితే సెక్షన్ 80%జ% కింద మీకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ పథకం బ్యాంకులతో సమానంగా వడ్డీని అందిస్తుంది. 6 నెలల తర్వాత అవసరమైతే మీరు కొంత మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చు. కానీ దానిపై వడ్డీ వసూలు చేస్తారు.

3 / 6

నెలవారీ ఆదాయ పథకం: మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ పదవీ విరమణ చేసిన వారికి, స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు ఇది ఒక అవకాశం. ఈ పథకం సంవత్సరానికి 7.4 శాతం వడ్డీని సంపాదిస్తుంది. రూ. 9 లక్షలు, ఉమ్మడి ఖాతా కలిగి ఉండాలనుకునే వారు గరిష్టంగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

నెలవారీ ఆదాయ పథకం: మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ పదవీ విరమణ చేసిన వారికి, స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే పెట్టుబడిదారులకు ఇది ఒక అవకాశం. ఈ పథకం సంవత్సరానికి 7.4 శాతం వడ్డీని సంపాదిస్తుంది. రూ. 9 లక్షలు, ఉమ్మడి ఖాతా కలిగి ఉండాలనుకునే వారు గరిష్టంగా రూ.15 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు.

4 / 6

సుకన్య సమృద్ధి యోజన: తమ ఆడపిల్ల చదువు, వివాహం కోసం ప్రణాళిక వేసుకునే వ్యక్తులకు అనుకూలం ఈ పథకం తీసుకోవచ్చు. 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఆడపిల్లల కోసం తల్లి లేదా తండ్రి ఈ స్కీమ్‌ను ప్రారంభించవచ్చు. ఈ పథకంలో పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పన్ను రహితంగా ఉంటాయి. వడ్డీ రేటు సంవత్సరానికి 8.2 శాతం. ఈ స్కీమ్‌లో మీరు రూ.250 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ స్కీమ్ కాల వ్యవధి 21 సంవత్సరాలు.

సుకన్య సమృద్ధి యోజన: తమ ఆడపిల్ల చదువు, వివాహం కోసం ప్రణాళిక వేసుకునే వ్యక్తులకు అనుకూలం ఈ పథకం తీసుకోవచ్చు. 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఆడపిల్లల కోసం తల్లి లేదా తండ్రి ఈ స్కీమ్‌ను ప్రారంభించవచ్చు. ఈ పథకంలో పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పన్ను రహితంగా ఉంటాయి. వడ్డీ రేటు సంవత్సరానికి 8.2 శాతం. ఈ స్కీమ్‌లో మీరు రూ.250 నుంచి రూ.1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. ఈ స్కీమ్ కాల వ్యవధి 21 సంవత్సరాలు.

5 / 6

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్: దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది ఉత్తమ ఎంపిక. పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పన్ను రహితంగా ఉంటాయి. అవసరమైన సమయంలో నిర్దిష్ట మొత్తాన్ని ఉపసంహరించుకోవడానికి ఈ ప్లాన్ మిమ్మల్ని అనుమతిస్తుంది. ఈ పథకంలో కనీస మొత్తం రూ.500 నుండి పెట్టుబడి పెట్టవచ్చు. గరిష్టంగా రూ. 15 సంవత్సరాలకు 1.5 లక్షలు.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్: దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది ఉత్తమ ఎంపిక. పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం అన్నీ పన్ను రహితంగా ఉంటాయి. అవసరమైన సమయంలో నిర్దిష్ట మొత్తాన్ని ఉపసంహరించుకోవడానికి ఈ ప్లాన్ మిమ్మల్ని అనుమతిస్తుంది. ఈ పథకంలో కనీస మొత్తం రూ.500 నుండి పెట్టుబడి పెట్టవచ్చు. గరిష్టంగా రూ. 15 సంవత్సరాలకు 1.5 లక్షలు.